అన్నదాతకు వాయు‘గండం’

- రైతన్నను వదలని తుపాన్లు
- అప్రమత్తమైన అధికారులు
- గిరిజన ప్రాంతంలో పలు చోట్ల వర్షం
- కల్లాల్లో ధాన్యాన్ని ఇళ్లకు చేరుస్తున్న రైతులు



పంట పొలాల్లోనే ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



ధాన్యాన్ని ఇంటికి తరలించేందుకు ఏర్పాటు చేసుకుంటున్న రైతులు

బుట్టాయగూడెం: బంగాళఖాతంలో ఏర్పాడిన అల్పపీడనంతో రెండు రోజుల్లో వాయు గుండంగా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం మబ్బులతో పాటు ఆకాశం మేఘావృతమై సాయంత్ర సమయానికి చినుకులుపడడంతో రైతులు హడలి పోయారు. అప్పటికే వరి కోతలు కోసిన రైతులు కొందరు కుప్పలు వేసుకోగా, మరి కొందరు యంత్రాల ద్వారా వరి కోతలు కోయించి వరి ధాన్యన్ని ట్రాక్టర్లతో తమ ఇళ్లకు తరలించేపనిలో రైతులు బిజీ అయ్యారు. ఏమాత్రం పెద్ద వర్ష కురిసినా పంటను కోల్పోతామని రైతులు భయాదోళన చెందుతున్నారు.

నియోజకవర్గంలో 24247 ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, పోలవరం ఏడు మండలాల పరిధిలో సుమారు 24247 ఎకరాల్లో రైతులు వరి పంట వేసినట్లు అధికారులు తెలిపారు. బుట్టాయగూడెం మండలంలో 3561 ఎకరాలు, జీలుగుమిల్లి 3020 ఎకరాలు, పోలవరం 6569 ఎకరాలు, కొయ్యలగూడెం 6584 ఎకరాలు, కుక్కునూరు 858 ఎకరాలు, వేలేరుపాడు 1255 ఎకరాలు, టి.నర్సాపురం 2400 ఎకరాల్లో రైతులు వరి పంటలను వేశారు. గింజ దశలో 70 శాతం ఉండగా 30 శాతం వరి పంట కోత పనులు జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అయితే ఇప్పటివరకూ బుట్టాయగూడెం మండలంలో 1000 ఎకరాల వరకూ వరి కోతలు కోశారు. ఇంకా 2500 ఎకరాల వరకూ వరి కోతలు కోయాల్సి ఉందని అధికారులు చెప్పారు. అలాగే జీలుగుమిల్లి మండలంలో 2100 ఎకరాల్లో వరికోత కోయాల్సి ఉంది. అలాగే కొయ్యలగూడెం, టి.నర్సాపురం, పోలవరం మండలాల్లో కూడా 60 శాతం వరకూ వరి కోతలు కోయాల్సి ఉందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల దృష్ట్యా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కల్లాల్లో ధాన్యం ఉంటే బరకాలతో కప్పుకోవాలని సూచిస్తున్నారు.

వేరుశనగ రైతుల్లో ఆందోళన

ప్రస్తుతం వరికోతలతో పాటు రైతులు వేరుశనగ పంటను కూడా ముమ్మరంగా కోస్తున్నారు. పలు చోట్ల వేరుశనగ పంట కూడా కల్లాల్లో ఉంది. రైతులు ట్రాక్టర్లలో వేరుశనగ పంటను ఇంటికి తరలిస్తున్నారు. అధిక వర్షం కురిస్తే నష్టపోతామంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



తుఫాను హెచ్చరికల నేపథ్యంలో వరి, వేరుశనగ రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పంట పొలాల్లో ధాన్యం ఉన్న రైతులు బరకాలు కప్పి ధాన్యాన్ని కాపాడుకోవాలి. కోత కోసి పంట పనలుగా ఉంటే దానిని గట్టు మీద పెట్టుకోవాలి. ఇంకా పంట కోయవలసిన రైతులు రైతులు కొద్ది రోజుల పాటు కోతలను నిలుపుదల చేయాలి.

డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం మండలం

పంటను ముందుగానే కోయించా..



తుఫానుకు భయపడి నా పంటను ముందుగానే కోయించాను. అయితే పచ్చిగా ఉన్న నా పంటను తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఆరుగాలం కష్టపడి పని చేసి పండించిన పంట వర్షం కురిస్తే నష్టపోతానని భయపడ్డాను. అందుకే ముందుగా పంట కోయించాను.

కొమరం బొజ్జి, రైతు, వీరన్నపాలెం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

ప్రజలకు అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఏ రాజు

కొయ్యలగూడెం: ప్రభుత్వ పథకాలైన ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన వంటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీవో ఎం.రాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎల్‌ఎస్‌డీజీసీ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సహకార సంఘాల నుంచి ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే నగదును సరైన మార్గంలో సద్వినియోగం చేసుకొని కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలన్నారు. ఈవోపీఆర్‌డీ జి.సతీష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు అంబటి సరస్వతి, వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం ఊటను పారబోస్తున్న పోలీసులు

కుక్కునూరు: నాటుసారా తయారీ కేంద్రాలపై బుధవారం కుక్కునూరు పోలీసులు దాడులు నిర్వహించారు. కుక్కునూరు సీఐ రమేష్‌బాబు చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని సీతారామనగరం గ్రామ సమీపంలోని కిన్నెరసాని నది ఒడ్డున గుట్టుచప్పుడు కాకుండా సారా తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు సారా తయారీ కేంద్రాలపై దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో 1000 లీటర్ల బెల్లపు ఊట, పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్టు చెప్పారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: ప్రజా ప్రతినిధులతో సహా దాతలు ముందుకు వచ్చి సహాయాన్ని అందిస్తే గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తాయని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు తుమ్మూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. మల్లుకుంటలో బుధవారం ఆర్‌వో వాటర్ ప్లాంట్ ప్రారంభం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మల్లుకుంటలో పంచాయతీ సర్పంచ్ తుమ్మూరి మాధవీలత కేటాయించిన పంచాయతీ స్థలంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ గాది రాజేంద్రప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.3 లక్షలతో షెడ్డును నిర్మించగా, మోండలీజ్ కంపెనీ, ఆప్సో సంస్థలు రూ.4 లక్షలు విలువ గల ఆర్‌వో ప్లాంట్ మిషనరీని సమకూర్చాయి. 20లీటర్ల వాటర్‌ను రూ.5కే అందించనున్నట్లు వాటర్ కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో మోండలీజ్ ఎగ్జిక్యూటివ్ సిబ్బంది, ఆప్సో సంస్థ స్టేట్‌కో–ఆర్డినేటర్ సురేష్, పీసీ నాగరాజు, ఏరియా సిబ్బంది వై.రాజేష్, గ్రామ కోకో రైతులు, గ్రామస్తులు, కమ్యూనిటీ లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్రీడా షూ బహూకరణ



విద్యార్థినులకు షూ పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో కళాశాల గణితశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ సీహెచ్ బదరీ నారాయణ అంతర్ కళాశాల వాలీబాల్ విద్యార్థినులకు షూ బహూకరించారు. కార్యక్రమంలో వాలీబాల్ విద్యార్థినులు డాక్టర్ సీహెచ్ బదరీ నారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం

చింతలపూడి: సుస్థిర అభివృద్ధి స్థానికీకరణ లక్ష్యాల కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ డాక్టర్ రాంబాబు నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో స్థిరమైన అభివృద్ధి స్థానికీకరణ అనే అంశంపై సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఆర్‌వోలు, ఏఎన్‌ఎంలు , మహిళా పోలీసులు, సర్వేయర్లకు రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న దుర్గా వరప్రసాద్

ద్వారకాతిరుమల: మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయాల పాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని గుండుగొలనుకుంటకు చెందిన అద్దంకి దుర్గా వరప్రసాద్ ఉదయం వెంకటకృష్ణాపురం నుంచి ద్వారకాతిరుమలకు తన బైక్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో వెంకటకృష్ణాపురానికి చెందిన యలమర్తి సురేష్ ద్వారకాతిరుమల నుంచి స్వగ్రామానికి కారులో వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి బైక్, కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో దుర్గా వరప్రసాద్ గాయాల పాలు కాగా, స్థానికులు హుటాహుటీన పీహెచ్‌సీకి తరలించి, చికిత్స అందించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

కుక్కునూరు: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం సీఐటీయూ ఆధ్వర్యంలో లారీ, మినీ, వ్యాన్, టాటా ఏసీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం యూనియన్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే ఒకరి ప్రాణాన్ని నిలబెట్టడమేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు మీనావినోద్, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, సీపీఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, వ్యవసాయకార్మిక సంఘం నాయకుడు వై నాగేంద్రరావు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు



చింతలపూడి: రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు



వేలేరుపాడు: రుద్రమకోట సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

చింతలపూడి: భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ డి.ప్రమద్వర దృష్టికి పట్టణంలో శ్మశాన భూమి, మెయిన్ రోడ్ ఆక్రమణకు గురయ్యాయని పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రమద్వర మాట్లాడుతూ శ్మశాన వాటిక భూమి ఆక్రమణ గురించి చర్యలు తీసుకుంటామని, మెయిన్ రోడ్డు ఆక్రమణపై సంబంధిత శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీహెచ్ ధర్మరాజు, తాటి అప్పారావు, కె.శేష గిరిరావు, మన్యం సత్తిబాబు, తూము విజయ్ కుమార్, వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

వేలేరుపాడు; గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు తీర్చేందుకే గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వేలేరుపాడు తహసీల్దార్ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం వేలేరుపాడు మండలంలోని రుద్రమకోటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో మండల ఉపసర్పంచ్ గుద్దేటి పావని, కూటమి నాయకులు శావిలి సుభాష్ చంద్రబోస్, కొవ్వాల క్రాంతి కుమార్, అమరవరపు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న దృశ్యం

లింగపాలెం: చింతలపూడి నియోజకవర్గ దళిత సేన నూతన కమిటీ నియామకం బుధవారం నిర్వహించారు. లింగపాలెం మండలంలో దళిత సేన ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శికకొల్లు స్టాలిన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ సమావేశంలో దళిత సేన చింతలపూడి నియోజకవర్గ నూతన కమిటీలను నియమించారు. చింతలపూడి నియోజకవర్గ దళిత సేన మహిళా అధ్యక్షురాలిగా మోసూరి దేవ మాత, చింతలపూడి దళిత సేన పట్టణ అధ్యక్షుడిగా కార్తీక్, లింగపాలెం మండల దళిత సేన ఇన్‌చార్జిగా పచ్చిగొల్ల ఉదయభాను, లింగపాలెం మండల దళిత సేన బీసీ సెల్ అధ్యక్షుడిగా కొప్పుల నాగేందర్, సింగగూడెం బీసీ సెల్ అధ్యక్షుడిగా చురవంచు రవీంద్ర, సింగగుడెం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పంతం శ్రీనివాసరావు, సింగగూడెం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా సికాకోల్లు మన్మధరావు, సింగగూడెం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పంతం గోపీ నియమితులయ్యారు. వీరికి రవి ప్రకాష్ నియమాక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా దళిత సేన ప్రధాన కార్యదర్శి పింగుల ఈదియా, దళిత సేనకార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలి



కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం బొత్తప్పగూడెంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం వలన ముంపుకు గురవుతున్న నిర్వాసిత భూములకు వెంటనే పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కేఆర్ పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు కారం రాఘవ మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలంలో బొత్తప్పగూడెం రెండు గ్రామాలు, గ్రామాల్లోని వ్యవసాయ భూములు, చింతలపూడి ఎత్తిపోతల పథకంలో పూర్తిగా మునిగిపోయాయన్నారు. ఈ గ్రామాల్లోని నిర్వాసితులకు కామయ్యపాలెంలో భూమిగా భూమి చూపించారన్నారు. అయితే వీటికి ఇంత వరకూ పట్టాదారు పుస్తకాలు ఇవ్వలేదని ఆ భూముల్లో గిరిజనేతర రైతులు గిరిజనులను సాగు చేసుకోనివ్వడం లేదని చెప్పారు. అనంతరం ఒక వినతి పత్రాన్ని ఏపీఓ నాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో తగరం బాబూరావు, కట్టం నాగేశ్వరరావు, కాకా పాపారావు, చంటి, నాగులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవారికి తిరువీధి సేవ



క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: ధనుర్మాస వేడుకల్లో భాగంగా శ్రీవారికి తిరువీధి సేవ క్షేత్ర పురవీధుల్లో బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించిన తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హారతులిచ్చారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామి వారి వాహనం తిరువీధి సేవకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, అశ్వ, గజ సేవల నడుమ శ్రీవారు క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు.

కిచెన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి

బుట్టాయగూడెం: కిచెన్ రూమ్‌తోపాటు డైనింగ్ హాల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.ధాత్రి రెడ్డి హెచ్చరించారు. మండలంలోని ఇప్పలపాడు సమీపంలోని ఏకలవ్య మోడ్రన్ స్కూల్‌ను జేసీ బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్ రూమ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆయా ప్రదేశాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించిన జేసీ సంబంధిత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పాఠశాలలు ఎప్పటికప్పుడు తనిఖీ చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ ఎంవీ రమణ, డీడీ పీవీఎస్ నాయుడులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా, ఏటీడబ్ల్యూఓ శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతిపత్రం అందజేత



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు

కుక్కునూరు: ఏజెన్సీ మండలాల్లోని సచివాలయ ఏఎన్‌ఎంలతో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పనులను చేయించొద్దని కోరుతూ బుధవారం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ఏఎన్‌ఎంలు కుక్కునూరు ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయూస్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు పాయం నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు సున్నం శ్రీరాములు దొర మాట్లాడుతూ సచివాలయం ఏఎన్‌ఎం ఉద్యోగస్తులను పంచాయతీరాజ్ శాఖ అదనపు పనులకు వాడుకోవడం దారుణమన్నారు. వారు కేటాయించిన అదనపు పనులు చేయకపోతే వేతనాలు ఆపేస్తామని డీడీఓ (పంచాయతీ కార్యదర్శి)లు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎల్‌టీలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా



జంగారెడ్డిగూడెం: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు



కుక్కునూరు: సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం



వేలేరుపాడు: విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నేతలు

కదం తొక్కిన ఎర్రదండు

జంగారెడ్డిగూడెం: పెంచిన విద్యుత్ చార్జీలు ట్రూఅప్ తగ్గించాలని స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలని అదాని విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పంగిడిగూడెం రోడ్‌లో గల విద్యుత్ సబ్‌స్టేషన్ నందు సీపీఎం పట్టణ మండల కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన చేశారు. సీపీఎం కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌర విద్యుత్ ఒప్పందం అదాని సంస్థలు కట్టబెట్టి దేశ రాష్ట్ర ప్రజల సంపదను దోపిడీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జోడే సూర్యచంద్రరావు, అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, వామిశెట్టి నరసరావు, ఎస్‌కే మాబు సుభాని, వంగ గోపి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆందోళన

కుక్కునూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారాలు మోపడం బాధాకరమని సీపీఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను విమర్శించారు. పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కుక్కునూరు సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, పులదాసు రమేష్, ఎస్.కె మహబూబ్ పాషా, వెంకటేశ్వర్లు, చంటి, సాయికిష్ట తదితరులు పాల్గొన్నారు..



కామవరపుకోట: బిల్లులను దహనం చేస్తున్న నేతలు

విద్యుత్ బిల్లుల దహనం

వేలేరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ, వేలేరుపాడు మండల కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్ వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో కొత్తా వెంకటేశ్వర్లు, గుమ్మల వెంకట నర్సయ్య, వినియోగదారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి

కామవరపుకోట: ట్రూఅప్ కరెంట్ స్మార్ట్ మీటర్లు పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ స్థానిక పాతూరు ఎస్సీ కాలనీలో కేవీపీఎస్ ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పెంచిన విద్యుత్ బిల్లులు తగలబెట్టారు. దుర్గారావు, వీరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని నిలదీయండి

చింతలపూడి: ట్రూఅప్ చార్జీల భారాన్ని రద్దు చేస్తామని చెప్పిన ఇప్పటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి మరింత భారం మోపుతోందని సీపీఎం మండల కన్వీనర్ పాండురంగారావు ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా సీపీఎం మండల శాఖల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ సూర్య కుమార్ ,డి సత్యనారాయణ, అబ్బిరెడ్డి రాహుల్ ,అనురాధ ,వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన వారోత్సవాల ర్యాలీ

కొయ్యలగూడెం: ఇంధన వారోత్సవ అవగాహన ర్యాలీ బుధవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ శాఖ ఏడీఈ బీవీ గోపాలకృష్ణ కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం ఏఈలు ఎస్‌వీ రామారావు, పి.సాంబయ్య పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. గణేష్ సెంటర్‌లో మానవహారం చేశారు. డిసెంబర్ 14 నుంచి 20 వరకు జరుగుతున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.